సాక్షి
వనపర్తి
బుధవారం : 17 : మే : 2023



వీఆర్ఏల నిరుత్సాహం

రెవెన్యూశాఖలోని వీఆర్ఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు.

వివరాలు 8లో ▶



అభాగ్యులకు 'వాత్సల్యం'

విధి వంచిన బాలలను ఆదుకునేందుకు 'మిషన్ వాత్సల్య' పథకం అమలులోకి వచ్చింది.

వివరాలు 10లో ▶

గరిష్ఠం/కనిష్ఠం
41.1 /27.2

వాతావరణం

ఉదయం ఉష్ణోగ్రత సాధారణంగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీయవచ్చు.

న్యూస్‌రీల్

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

గోపాల్‌పేట: అడవులను సంరక్షించడం అందరి బాధ్యతని ఫారెస్ట్ డిప్యూటీరేంజ్ ఆఫీసర్ స్వర్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని బుద్దారంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నాలుగోరోజు నిర్వహించిన 'మీట్ టుడే గెస్ట్'లో జిల్లా అటవీ అధికారులు పాల్గొని అడవుల ప్రాధాన్యం, సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలో ఎవరైనా అక్రమంగా చెట్లను నరకడం, జంతువులను చంపడం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ జ్యోతిర్మయి, చంద్రశేఖర్, వజీద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యవర్గం ఎన్నిక



వనపర్తి: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గం మంగళవారం స్థానిక డా. బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా పుర వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, ప్రధానకార్యదర్శిగా బొలమోని నర్సింహ, ఉపాధ్యక్షులుగా షంషీర్ అలీ, బొలెమోని రామచందర్, కురుమయ్య, కోశాధికారిగా కె.శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా నందిమళ్ల శ్రీకాంత్, సభ్యులుగా ఎస్.వెంకటేష్, హెచ్.గోవింద్, అచ్చన్న, జై నారాయణ, కె.లక్ష్మణమూర్తి, శివ ఎన్నికయ్యారు. ఎన్నికల పర్యవేక్షకుడిగా నారాయణపేట జిల్లా ప్రధానకార్యదర్శి రామన్న, రిటర్నింగ్ అధికారిగా సురేందర్‌రెడ్డి వ్యవహరించారు. పీడీ సుదీర్‌రెడ్డి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి స్థాయీ సంఘాల సమావేశాలు

వనపర్తి: జెడ్పీ స్థాయీసంఘాల సమావేశాలు బుధ, గురువారం కొనసాగుతాయని జెడ్పీ సీఈఓ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రెండు, మూడు, నాలుగు, అయిదో స్థాయీ సంఘం సమావేశాలు, గురువారం ఒకటి, ఆరు, ఏడో స్థాయీసంఘం సమావేశాలు ఉంటాయని.. సంబంధిత శాఖల అధికారులు సమావేశాలకు విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: జిల్లాలోని గిరిజన బాల బాలికలకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికిగాను 3, 5, 8వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలు గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో లభిస్తాయని.. జూన్ 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల, జనన, ఆదాయ ధ్రువపత్రాలు, పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు దరఖాస్తుకు జతచేసి అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 73967 07862, 85230 73971 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గడువులోగా బియ్యం ఇవ్వాలి



వనపర్తి: 2021–22 రబీ సీజన్ సీఎంఆర్ బియ్యం 31వ తేదీలోగా పూర్తిగా ఇవ్వాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం మండలంలోని సవాయిగూడెం, నాచహళ్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గడువులోగా బియ్యం ఇవ్వని మిల్లర్ల నుంచి 125 శాతం బియ్యంగాని నగదుగాని వసూలు చేస్తామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్‌లు ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రైతులకు సకాలంలో డబ్బులు బ్యాంకు ఖాతాలో జమయ్యేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, పౌరసరఫరాలశాఖ అధికారులు సీఎంఆర్ వసూళ్లపై దృష్టి సారించాలని, నిబంధనలు పాటించని మిల్లర్లపై చర్యలకు సిఫారసు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఎం కొండల్‌రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, మిల్లర్లు పాల్గొన్నారు.

అందని నజరానా!

రెండేళ్లుగా కేసీఆర్ కిట్‌తోనే సరిపెడుతున్న ప్రభుత్వం



గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు (ఫైల్)

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1.16 లక్షల ప్రసవాలు
- రికార్డుస్థాయిలో సిజేరియన్లు
- 74 వేల మందికి రూ.22.27 కోట్ల చెల్లింపు
- 18,872 కిట్లు పంపిణీ.. రూ.12.31 కోట్ల పెండింగ్

ఆత్మకూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.. సర్కారు దవాఖానా అంటే జంకేవారు సైతం క్యూ కడుతున్నారు. ప్రసవాలకు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు రెండేళ్లుగా కేసీఆర్ కిట్‌తోనే సరిపెడుతుంది ప్రభుత్వం. 42,288 మందికి నాలుగు విడతల్లో రూ.12.31 కోట్లు చెల్లించాల్సి ఉంది. కేసీఆర్ కిట్ ప్రారంభం నుంచి జిల్లాలో రికార్డుస్థాయిలో 1.16 లక్షల ప్రసవాలు జరిగాయి. ఆపరేషన్ థియేటర్లు ప్రారంభించి సిజేరియన్లు సైతం చేస్తుండటంతో గర్భిణులకు మేలు చేకూరుతుంది.

- 2017, జూన్ నుంచి ఈ ఏడాది మే మొదటి వారం వరకు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ, అసాధారణ కాన్పులు 1,16,513 జరిగాయి. జిల్లా ఆస్పత్రితో పాటు ఆత్మకూర్, రేవల్లి, ఖిల్లాఘనపూర్ ఆస్పత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేసి సిజేరియన్లు నిర్వహిస్తున్నారు. జనని శిశు సంరక్షణ పథకం ద్వారా ఒక్కో గర్భిణికి మగశిశువు జన్మిస్తే రూ.12 వేలు, ఆడ శిశువు జన్మిస్తే 13 వేలు నాలుగు విడతల్లో జమ చేస్తారు. 74,225 మందికి రూ 22.27 కోట్లు వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. అలాగే 18,872 మందికి కేసీఆర్ కిట్లు అందించారు.



బాలింతకు కేసీఆర్ కిట్ అందజేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

విడతల వారీగా బకాయిలు..

మొదటి విడత 11,460 మంది గర్భిణులకు రూ.మూడు వేల చొప్పున రూ.3.44 కోట్లు.. రెండో విడత ఆడపిల్ల పుడితే రూ.5 వేలు, మగ పిల్లవాడు పుడితే రూ.4 వేల చొప్పున 8,450 మందికి రూ.3.38 కోట్లు.. మూడో విడత కాన్పు జరిగిన 100 రోజులకు రూ.రెండు వేల చొప్పున 12,180 మందికి రూ.2.44 కోట్లు.. ప్రసవం అయిన 9 నెలలకు రూ.మూడు వేల చొప్పున 10,195 మందికి రూ.3.06 కోట్లు వారి వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది.
మొత్తంగా 42,288 మంది లబ్ధిదారులకు రూ.12 కోట్ల 31 లక్షల 37 వేలు చెల్లించాల్సి ఉంది.

రెండు కాన్పులైనా.. డబ్బులు రాలేదు...



పాన్‌గల్ ప్రభుత్వ ఆస్పత్రిలో 2021, ఫిబ్రవరిలో మొదటి కాన్పు కాగా బాబు పుట్టాడు. పైసలొస్తాయని చెప్పిండ్రు కానీ రాలేదు. మళ్లీ 2022, ఆగస్టులో అదే ఆస్పత్రిలో రెండోకాన్పులో పాప పుట్టింది రూ.13 వేలు వస్తాయన్నారు.. రాలేదు. కేసీఆర్ కిట్ మాత్రమే ఇచ్చారు. – శైలజ, పాన్‌గల్

రెండేళ్లుగా ఎదురుచూపులు..



నాకు 2021, జూన్‌లో పాప పుట్టింది. కేసీఆర్ కిట్ మాత్రమే ఇచ్చారు. ఏడాది అవుతున్నా నేటికీ డబ్బులు జమకాలేదు. ఆస్పత్రిలో సార్ వాళ్లను అడిగితే వస్తాయని చెబుతున్నారు.
– పుష్పలత, నందిమళ్ల, అమరచింత

త్వరగా ఇస్తే బాగు..



2022, ఫిబ్రవరి 9న ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో సిజేరియన్ కాన్పు జరిగింది. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు జరిగితే కేసీఆర్ కిట్ మాత్రమే ఇచ్చారు.. డబ్బులు ఇంకా రాలేదు.. త్వరగా ఇస్తే బాగుంటుంది. – లక్ష్మి, పాతర్చేడ్, నర్వ

ఉన్నతాధికారులకు నివేదించాం..



బకాయిలకు సంబంధించిన నివేదికను వైద్య, ఆరోగ్యశాఖకు నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే వారి వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు ప్రతినెల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మెరుగైన వైద్యం అందిస్తున్నాం. సాధారణ, అసాధారణ ప్రసవాలు చేస్తూ ఉచితంగా మందులు అందిస్తున్నాం.
– డా. రవిశంకర్, డీఎంహెచ్ఓ, వనపర్తి

మాది గిరిజనుల ప్రభుత్వం..



అచ్చంపేటలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

- రాష్ట్రంలో గిరిజనుల కోసం ప్రత్యేక పథకాలు
- గిరిజన అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

అచ్చంపేట రూరల్: తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తోందని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం అచ్చంపేట మండలంలోని పలు గిరిజన తండాలలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుతో కలిసి ఆమె పర్యటించారు. అచ్చంపేట మండలంలోని చెంచు పల్లు తండా, నక్కర్ల పెంట, పొలిశెట్టిపల్లి తండాల్లో కొత్తగా నిర్మించనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఐటీడీఏ ద్వారా చెంచులకు జీవనోపాధి కల్పించడంలో భాగంగా 250 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1లక్ష విలువ చేసే సూక్ష్మ పరిశ్రమల యూనిట్లను అందజేశారు. షెడ్యూల్ ట్రైబ్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.2.25 కోట్ల అంచనాలతో చెంచుపల్లు తండా నుంచి లక్ష్మాపూర్ వరకు 2.4కి.మీ.ల బీటీ రోడ్డు, అలాగే శంకరాయగుట్టతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తండాలలో తండావాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి లంబాడి గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేసి ఉత్సాహపరిచారు. అనంతరం అచ్చంపేటలో ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను గిరిజన బిడ్డగా నిరుపేదల కష్టాలను కళ్లారా చూశానని చెప్పారు. ఎమ్మెల్యేగా ఓడిన తర్వాత సర్పంచు, జెడ్పీటీసీగా పనిచేశానని తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వం తెలంగాణ ఒక్కటేనని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కల్యాణలక్ష్మి వంటి పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఓట్లడిగే హక్కు లేదన్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడని చెప్పారు.

■ గురుకుల పాఠశాలలకు రూ.240 కోట్లు, ప్రతి యూనివర్సిటీ హాస్టల్‌కు రూ.140 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అభ్యర్థన మేరకు అచ్చంపేటలోని సేవాలాల్ భవనానికి అదనంగా మరో రూ.1కోటి, మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద భక్తుల సత్రం కోసం రూ.1కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ప్రభుత్వ విప్ గువ్వల మాట్లాడుతూ.. మంత్రి శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ దగ్గరుండి చేయిస్తానన్నారు. వచ్చే నెలలో సీఎం కేసీఆర్ అచ్చంపేట నియోజకవర్గానికి వస్తారని, ఉమామహేశ్వరం, చెన్నకేశవ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభిస్తారన్నారు. గిరిజన తండాల్లో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను వచ్చే ఎన్నికలకు ముందే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ శాంతాకుమారి, అదనపు కలెక్టర్ మనూచౌదరి, గిరిజన శాఖ సంయుక్త కార్యదర్శి సర్వేశ్వరరెడ్డి, సీతఖ జ్యోతి, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ, జెడ్పీటీసీలు రాంబాబునాయక్, మంత్రియానాయక్, ఎంపీపీ శాంతాబాయి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, తులసీరాం, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల కట్టడికి ప్రణాళికలు

కలెక్టర్
తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: జిల్లా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించటం, నకిలీ విత్తనాల కట్టడికి ముందస్తు ప్రణాళికతో సిద్ధమవుతున్నామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని వివరాలు వెల్లడించారు. జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వానాకాలం సాగును దృష్టిలో ఉంచుకొని కావాల్సిన విత్తనాలు, ఎరువుల వివరాల అంచనాలను సిద్ధం చేయించామన్నారు. నిర్దిష్టమైన నిల్వలు మాత్రమే ఉండేలా విక్రయ కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేసినట్లు వివరించారు. విత్తనోత్పత్తి పరిశ్రమకు ఇబ్బంది కలగకుండా, ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాకుండా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి నిఘా పెంచుతామన్నారు. వీసీ అనంతరం జిల్లా వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ బృందం ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నకిలీపై ఉక్కుపాదం మోపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రక్షితా కె.మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్.. చిత్రంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్

వారం పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు..

ఈ నెల 17 నుంచి 23 వరకు అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి వెబెక్స్‌లో సర్పంచులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చటం, శుభ్రం చేయటం లాంటి పనులు చేపట్టాలన్నారు. గ్రామ పరిసరాల్లోని పిచ్చిమొక్కలు తొలగించాలని, కాల్వలను శుభ్రం చేసి ఎక్కడా మురుగు నిల్వకుండా చూడాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు అన్ని ప్రభుత్వ సంస్థల భవనాల పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. శిథిల ఇళ్లు, భవనాలను కూల్చాలని, ఆవాసాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పాడుబడ్డ బావులను పూడ్చాలని, నిరుపయోగంగా ఉన్న బోరుబావులను మూసివేయాలన్నారు. మురుగు నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ విసరడం, యాంటీ లార్వా రసాయనాలు చల్లడం, ఫాగింగ్ వంటివి చేపట్టి దోమల వృద్ధి నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీపీఓ సురేష్‌కుమార్, డీఎల్‌పీఓ రఘురాంరెడ్డి, జెడ్పీ సీఈఓ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- నిమిషం నిబంధన అమలు
- జిల్లాకు ప్రత్యేక పరిశీలకుడిని నియమించిన సాంకేతిక విద్యామండలి

వనపర్తిటౌన్: పాలిటెక్నికల్ కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికిగాను సీట్ల భర్తీకి ప్రభుత్వం పాలిసెట్–2023 పరీక్షను బుధవారం నిర్వహించనుంది. పరీక్ష కేంద్రాల వారీగా ఏర్పాట్లను మంగళవారం అధికార యంత్రాంగం పూర్తి చేసింది. సాంకేతిక ఉన్నత విద్యామండలి జిల్లాకు ప్రత్యేక పరిశీలకుడిగా వై.సత్తయ్యను నియమించగా కేంద్రాలను కన్వీనర్ డా.చంద్రశేఖర్‌తో కలిసి వసతులు, సౌకర్యాలపై ఆరా తీయడంతో పాటు పలు సూచనలు చేశారు. జిల్లాకేంద్రంలోని కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్, రావూస్ జూనియర్ కళాశాల, మదర్స్‌ల్యాప్ హైస్కూల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల కళాశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, గాయత్రి బీఈడీ కళాశాలతో పాటు కొత్తకోటలోని బెస్ట్ గ్రామర్ హై స్కూల్, నివేదిత హైస్కూల్, పెబ్బేర్‌లోని టీఎస్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, మాస్టర్‌మైండ్ స్కూల్, పాన్‌గల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రవేశ పరీక్ష కొనసాగనుండగా.. 2,683 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రంలోకి హాల్‌టిక్కెట్, బాల్‌పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్, రబ్బర్, షార్ప్‌నర్ మినహా మిగతా ఎల్రక్టానిక్, ఇతర సామగ్రిని అనుమతించరు. విద్యార్థులను గంట ముందుగానే కేంద్రంలోకి అనుమతిస్తారు. 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైన అనుమతించరు. పరీక్షల నిర్వహణకు 107 మంది ఇన్విజిలేటర్లతో పాటు రిజర్వులో మరో 55 మందిని అందుబాటులో ఉంచారు.

ఆధార్ జిరాక్స్ తీసుకురావాలి..

ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల ధ్రువీకరణపై సందేహం తలెత్తితే ఆధార్‌కార్డు పరిశీలిస్తామని.. జిరాక్స్ ప్రతిని తీసుకురావాలని పాలిసెట్ కన్వీనర్ డా. చంద్రశేఖర్ తెలిపారు. రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులు సమయానికి నడపాలని ఆర్టీసీ అధికారులను కోరామన్నారు. ప్రతి కేంద్రం వద్ద ఏఎన్‌ఎం అందుబాటులో ఉంటుందని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేక పరిశీలకుడిని నియమించామని, ఇన్విజిలేటర్లు కేంద్రంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని సూచించారు.



జిల్లాకేంద్రంలోని కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కాంగ్రెస్‌లో జోష్..

- పాలమూరుకు చేరిన భట్టి యాత్ర
- తొలిరోజు కిలాట్‌నగర్ నుంచి ప్రారంభం
- 4.5 కి.మీ మేర కొనసాగిన పాదయాత్ర
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తామన్న సీఎల్పీ నేత
- కొల్లూరును మండలం చేస్తామని హామీ



నవాబుపేట మండలంలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్కతో కలిసి పాదయాత్ర చేస్తున్న నాయకులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/నవాబుపేట: ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ పార్టీలో జోష్ నింపుతోంది. తొలిరోజు జడ్చర్ల నియోజకవర్గంలోని కిలాట్‌నగర్ నుంచి ఆయన పాదయాత్ర మొదలై నాలుగున్నర కి.మీ మేరకు కొనసాగింది. మంగళవారం రాత్రి 8.15 గంటలకు కేశవరావుపల్లి వద్ద పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం కొల్లూరు చౌరస్తాలో నిర్వహించిన మినీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి తొమ్మిదేళ్లయినా ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏడాదిలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొల్లూరును సైతం మండలంగా ఏర్పాటు చేస్తామన్నారు. పాలమూరు రాబిన్‌హుడ్‌గా పిలుచుకునే పండుగ సాయన్న.. దున్నేవాడిదే భూమి అంటూ భూమికి హక్కు కల్పించిన మొదటి నాయకుడని అన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు స్ఫూర్తితో పేదల కోసమే కాంగ్రెస్ పనిచేస్తోందని, ప్రజావసరాలకు వ్యతిరేకంగా ఏనాడూ పనిచేయదని స్పష్టం చేశారు. ఇంటికో ఉద్యోగం, డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. నేడు ఉద్యోగాల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. ప్రజల శ్రేయస్సు మరచిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు.

■ టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకునేందుకే భట్టి పాదయాత్ర చేపట్టారన్నారు. నిరుద్యోగులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 100 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి రానుందని జోస్యం చెప్పారు. కర్ణాటక తరహాలోనే రాష్ట్రంలోనూ పీసీసీ, సీఎల్పీ నేతలంతా కలసికట్టుగా ప్రజల కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. వచ్చేఎన్నికల్లో తాను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలనుకుంటున్నానని వెల్లడించారు.

పేదల కష్టాలపై కేసీఆర్‌కు పట్టింపు లేదు : ఎమ్మెల్యే సీతక్క

రాష్ట్రంలో పేదలు అనుభవిస్తున్న కష్టాలపై సీఎం కేసీఆర్‌కు పట్టింపు కరువైందని ఎమ్మెల్యే సీతక్క విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని చెప్పారు. రేషన్ దుకాణాల్లో బియ్యం తప్పా సరుకులేమీ ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు వంద రోజుల పని కల్పిస్తే, బీఆర్ఎస్ నాయకులు మాత్రం వందల ఎకరాలు వెనకేసుకుంటున్నారని దుయ్యబట్టారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వస్తేనే పేదలకు కూడు, గుడ్డ దొరుకుతుందన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు: సంపత్‌కుమార్

కర్ణాటకలో 40శాతం కమీషన్ తీసుకున్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలోనూ దళితబంధు కింద రూ.3లక్షల చొప్పున 30శాతం కమీషన్ తీసుకున్న బీఆర్ఎస్ సర్కారుకు అదే గతి పడుతుందని చెప్పారు. పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ గతంలోనే 90 శాతం ప్రాజెక్టులను పూర్తి చేసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను అభివృద్ధి చేయకుండా తొమ్మిదేళ్లుగా మోసం చేస్తోందని దుయ్యబట్టారు.

■ టీపీసీసీ నాయకుడు అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భూములు కొన్న చోటే రోడ్లు బాగుంటాయని, మిగతా చోట అధ్వానంగా మారాయని విమర్శించారు. కొల్లూరును మండలం చేస్తామని చెప్పి ఉదండాపూర్ చుట్టూ ఉన్న చెరువుల్లో మట్టి కొల్లగొట్టి రూ.కోట్లు వెనుకేశారని ఆరోపించారు. పేదల గురించి పట్టించుకోని ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు చేపట్టకుండా రాష్ట్రాన్ని దోచుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపాలని కోరారు.వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రలోభాలకు లొంగవద్దని ప్రజలను విజ్ఞప్తి చేశారు. సమాజ మార్పుకోసం సీఎల్పీ నేత భట్టి చేపట్టిన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాలో భట్టి పాదయాత్ర మంగళవారం రాత్రి 11 గంటలకు బస చేసే ప్రాంతానికి చేరుకున్నారు. కాగా.. కేశరావుపల్లి వద్ద పండుగ సాయన్న విగ్రహం ఆవిష్కరించే సమయంలో అనిరుధ్‌రెడ్డి, ఎర్రశేఖర్ వర్గీయులు ఎవరికి వారు పోటాపోటీగా నినాదాలు చేశారు. మాజీ మంత్రి చిన్నారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకుడు ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్సు ఢీ.. విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం



మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఓ రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం మానాజీపేటకు చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ వెంకటరాములు(63) ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని కుమ్మరివాడిలో నివాసం ఉంటున్నాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం 2.30ప్రాంతంలో క్రిస్టియన్‌పల్లిలో ఉన్న బ్యాంకుకు పనిమీద వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి కుమ్మరివాడికి తన టీఎస్06 ఈడబ్ల్యూ9908నంబర్ కలిగిన ద్విచక్ర వాహనంపై బయల్దేరగా.. ఘనపురం నుంచి మహబూబ్‌నగర్ వైపు వస్తున్న టీఎస్ 34టీఏ 5818నంబర్ కల్గిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కొడుకు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. రోడ్డు ప్రమాదం వల్ల భూత్పూర్–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దమందడి మండలం వెల్టూర్ ఎన్‌హెచ్44పై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డాకుల మండలం కన్మనూర్ గ్రామానికి చెందిన శ్రీహరి(55) పనిమీద వెల్టూర్ గ్రామానికి వచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నాగమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానవపాడు: జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. మృతుడి ఎడమ ఛాతిపై స్వప్న, కుడిచేతి భుజం మీద కౌషిక్, కుడి చేతి మణికట్టుపై నాగమణి, కుడిచేయిపై అమ్మని తెలుగులో రాసి ఉందని వివరించారు. అలాగే కుడి చేతి మీద ఓం, త్రిశూలం బొమ్మలు ఉన్నాయని.. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 8712670288, 8712574021 సంప్రదించాలని సూచించారు.

మృతదేహం లభ్యం

వనపర్తి: మండల పరిధిలోని చిట్యాల శివారులోని వాటర్ ట్యాంకు సమీపంలో మంగళవారం ఓ వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వృద్ధుడు కదలకుండా పడి ఉన్నాడని, ఆ ప్రాంతంలోని పశువుల కాపర్లు అందించిన సమాచారం మేరకు పరిశీలించి.. 65 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రెండు రోజుల పాటు మృతదేహాన్ని అక్కడే ఉంచుతామన్నారు. వారి కుటుంబసభ్యులు, బంధువులు ఎవరూ రాకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఖననం చేస్తామని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీ హైడ్రేషన్ వలన వృద్ధుడు మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

వీఆర్‌ఏల నిరుత్సాహం



మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలో వీఆర్‌ఏలు (ఫైల్)

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తాత్సారం

- సీఎం హామీ ఇచ్చి ఆరు నెలలైనా.. ఫలితం శూన్యం
- 2022లో 80 రోజుల సమ్మె
- డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి

మహబూబ్‌నగర్ రూరల్: రెవెన్యూశాఖలో పనిచేసే విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్‌ఏ)లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్‌ఏలు చేపట్టిన ఆందోళనలకు దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చి ఆరునెలలు దాటినా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కనీసం సమ్మెకాలం నాటి వేతనాలు కూడా సర్కార్ ఇచ్చిన పాపాన పోలేదు. ప్రభుత్వం స్పందించి హామీలు నెరవేర్చి తమ కుటుంబాలను ఆదుకోవాలని వీఆర్‌ఏలు డిమాండ్ చేస్తున్నారు.

80 రోజుల పాటు ఆందోళన..

తమ సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు 2022, జూన్ 25 నుంచి అక్టోబర్, 12 వరకు 80 రోజుల పాటు విధులకు హాజరుకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. పల్లె నుంచి రాజధాని హైదరాబాద్ వరకు ధర్నాలు, రాస్తారోకోలు, మానవహారాలు, వంటావార్పు, ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. వీటితో పాటు అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట టెంట్లు వేసుకొని నిరహార దీక్షలు చేపట్టారు. దీంతో వీఆర్‌ఏలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉమ్మడి జిల్లాలో 2,752 మంది..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల పోస్టులు 3,271 ఉండగా.. 2,752 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 519 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పూర్వం గ్రామ రెవెన్యూ సేవకుడిగా కొనసాగగా.. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దానిని గ్రామ రెవెన్యూ సహాయకుడిగా (వీఆర్‌ఏ)గా మార్చి రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపిక చేశారు.

పేస్కేల్ వర్తింపజేస్తామని..

చర్చల సమయంలో వీఆర్‌ఏలకు పేస్కేలు వర్తింపజేస్తామని, వృద్ధాప్యంలో ఉన్న వీఆర్‌ఏల స్థానంలో ఆ కుటుంబంలోని ఒకరికి (కారుణ్య నియామకం) అవకాశం ఇస్తామని, విద్యార్హత ఆధారంగా పదోన్నతులు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. మునుగోడు ఉప ఎన్నికల తర్వాత సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చింది. మునుగోడు ఉప ఎన్నిక పూర్తవడమే కాదు.. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్నా వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి మోక్షం లభించడం లేదు. డా. బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రారంభం రోజున ముఖ్యమంత్రి కేసీఆర్ నోట తీపి కబురు వింటామని ఆశపడ్డ వీఆర్‌ఏలకు నిరాశే మిగిలింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఎం.. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారంపై ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. ఇప్పటికైనా సీఎం తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చి కుటుంబాలకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

రూ.11,385 నెలసరి వేతనంతో

విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్‌ఓ)లను ఇతర శాఖలకు సర్దుబాటు చేయడంతో వీఆర్‌ఏలు రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా మారారు. ఉన్నత చదువులు చదివి పరీక్ష ద్వారా ఎంపికైన వీఆర్‌ఏలు గ్రామాల నుంచి మొదలు తహసీల్, ఆర్డీఓ కార్యాలయాల్లోని కంప్యూటర్ ఇతరత్రా శాఖల్లో వారే కీలకంగా పని చేస్తున్నారు. గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలులో ముఖ్య భూమిక.. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. ఎన్నికల సమయంలో బూత్ లేవల్ ఆఫీసర్ (బీఎల్వో)లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంత కీలకంగా ఉన్న వీఆర్‌ఏలు ప్రతినెల రూ.11,385 చాలీచాలని వేతనంతో, సమయపాలన, ఉద్యోగ భద్రత లేకున్నా విధులు నిర్వర్తిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పేస్కేలు, 30 శాతం పీఆర్సీ, బెనిఫిట్స్ వర్తింపజేయాలి. సమ్మె కాలం వేతనం చెల్లించాలి. సమ్మె కాలంలో చనిపోయిన వీఆర్‌ఏల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి.

– ఎండీ మునీర్, వీఆర్‌ఏ జేఏసీ జిల్లా కన్వీనర్, మహబూబ్‌నగర్

పేస్కేల్ చిరకాల వాంఛ..



వీఆర్‌ఏలకు పే స్కేల్ వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించి ఆరేళ్లైంది. పే స్కేల్ జీఓ ఇస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించి ఆరునెలలవుతున్నా నేటికీ నెరవేరడం లేదు. సమ్మె ముగిసి ఆరు నెలలైనా ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేరలేదు. సెర్ప్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతూ జీఓ ఇచ్చినట్లే తమకు కూడా మార్చి చివరలో పేస్కేలు జీఓ వస్తుందని ఆశించాం.. కానీ నిరాశే ఎదురైంది.

– యాదగిరి, వీఆర్‌ఏ జేఏసీ చైర్మన్, మహబూబ్‌నగర్ అర్బన్

జిల్లాల వారీగా గ్రామ రెవెన్యూ సహాయకులు	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	నారాయణపేట	జోగులాంబ గద్వాల
	480	671	583	556	462

షేక్‌పల్లిలో ఇరువర్గాల ఘర్షణ



మహమ్మదాబాద్‌లో పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులతో మాట్లాడుతున్న మత్స్యకారులు

- ముస్లింలకు, మత్స్యకారులకు చేపల పంచాయతీ
- పలువురికి గాయాలు.. పోలీసులకు ఫిర్యాదు

మహమ్మదాబాద్: మండల పరిధిలోని షేక్‌పల్లి చెరువులో రెండు వర్గాల ఘర్షణతో పలువురు గాయపడ్డారు. దీంతో ఈ పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. షేక్‌పల్లికి చెందిన చెరువులో చేపల విషయమై కొంతకాలంగా గ్రామంలోని ముస్లింలకు, మత్స్యకారులకు గొడవ జరుగుతోంది. చెరువును మహమ్మదాబాద్ మత్స్యకారులు సొసైటీ పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రతీసారి చెరువులో చేపలు పడితే గ్రామంలో ఉన్న ముస్లింలకు భాగం పంచిఇచ్చేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో మత్స్యకారులకు రిజిస్ట్రేషన్ కావడంతో చేపలు మేమే పట్టుకుంటామని ముస్లింలకు ఎలాంటి సంబంధంలేదని చెప్పారు. చేపలు పట్టడానికి వెళ్లారు. దీంతో ముస్లింలు అక్కడికి వెళ్లడంతో ఇరువర్గాల మధ్య గొడవ తలెత్తింది. మత్స్యకారులకు గాయాలు కావడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. లేదంటే రోడ్డుపై బైఠాయిస్తామని పెద్దఎత్తున అక్కడికి వచ్చిన మత్స్యకారులను పలువురు సముదాయించారు. రెండు రోజులు ఆగి పంచాయతీ తేల్చుతామని సీఐ రాజేశ్వర్, ఎస్‌ఐ సైదయ్య తెలిపారు. దీంతో అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రసవానికి వైద్యులు నిరాకరించారంటూ..

ఆస్పత్రి ఎదుట గర్భిణి బంధువుల ఆందోళన



ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు

అచ్చంపేట రూరల్: ప్రసవానికి వైద్యులు నిరాకరించారంటూ గర్భిణి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేసిన ఘటన మంగళవారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. అమ్రాబాద్ మండలం మన్ననూర్‌కు చెందిన స్పందన అనే గర్భిణి పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు కాన్పు కష్టతరంగా ఉందని, రక్తం తక్కువగా ఉందని, ఆ గ్రూప్ రక్తం అందుబాటులో లేదని వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. రక్తం తీసుకొస్తామని, ఇక్కడే కాన్పు చేయాలని కుటుంబీకులు వేడుకున్నా అందుకు వైద్యులు అంగీకరించలేదు. దీంతో కాసేపు వైద్యులు, కుటుంబసభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొని ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేశారు. చివరకు చేసేదేమీ లేక వెంటనే సొంత వాహనంలో కల్వకుర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై వైద్యురాలిని సంప్రదించేందుకు యత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న సిమెంట్ లారీ

- నలుగురి దుర్మరణం.. మరో నలుగురికి గాయాలు
- రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ వద్ద ఘటన



లక్ష్మణాచారి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్/కల్వకుర్తి రూరల్: పొద్దంతా పనిచేసి ఇంటికి వెళ్లి హాయిగా నిద్ర పోదామని అనుకున్నారు.. కానీ అంతలోనే శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. ఆగి ఉన్న డీసీఎంను సిమెంట్ లారీ ఢీకొన్న ప్రమాద ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. హైదరాబాద్‌లోని జియాగూడకు చెందిన ఐనాల మహేశ్ అలియాస్ బల్లు(21), వంపనోళ్ల మహేశ్ (55)తో పాటు మరికొంత మంది డీజే సౌండ్స్‌లో పని చేసేవారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం రాత్రి జరిగిన వేడుకలో పనులు ముగించుకొని అర్ధరాత్రి డీసీఎంలో ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. తుర్కయంజాల్ సమీపంలో తులిప్స్ గ్రాండ్ హోటల్ వద్ద ఆగిన డీసీఎంలోకి ఎల్బీనగర్ వెళ్లేందుకు నాగ సాయిరెడ్డి, శివారెడ్డి, లింగారెడ్డి ఎక్కుతుండగా మాచర్ల నుంచి ఇంజాపూర్ గోదాంకు సిమెంట్ లోడ్‌తో అతివేగంగా వస్తున్న లారీ (టీఎస్15యుఏ 2851) డీసీఎంను బలంగా ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న డీజే ఆపరేటర్ బల్లు, వంపలోళ్ల మహేశ్, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పాతమల్లయ్య పాలెంకు చెందిన నాగ సాయిరెడ్డి(22) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మంగళవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తోటపల్లికి చెందిన తుమ్మోజు లక్ష్మణాచారి(52) మరణించాడు. అలాగే.. గుంటూరు జిల్లాకు చెందిన శివారెడ్డి, లింగారెడ్డి ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు. జియాగూడకు చెందిన అభిలాష్ చెవి తెగిపోగా.. సురేష్ కాలు విరిగింది. కాగా, డ్రైవర్ రవీందర్ మద్యం మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని, అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రవికుమార్ చెప్పారు.

కాగా.. మృతిచెందిన లక్ష్మణాచారి కల్వకుర్తి మండలంలోని తోటపల్లి రైతుసమన్వయ సమితి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సోమవారం బంధువుల వివాహానికి హైదరాబాద్‌లోని తుర్కయంజల్ వెళ్లి వస్తుండగా.. ఈ ప్రమాదంలో మృతి చెందాడు.

వృద్ధాప్యంలో నిరాదరణ బాధేస్తోంది



మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు

బిజినేపల్లి: తమ పిల్లల జీవితం బాగు కోసం సర్వస్వాన్ని ధారపోసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురికావడం.. వృద్ధాశ్రమాలను ఆశ్రయించడం మనసును బాధ కలిగించేలా ఉందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు అన్నారు. వృద్ధులు తమ కుటుంబం వద్దకు వెళ్లాలనుకుంటే వారికి న్యాయ పరిధిలో తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని వృద్ధాశ్రమంలో 'వృద్ధుల హక్కులు.. పరిరక్షణ' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వృద్ధాప్యంలో ఓ పక్క రోగాలు.. మరోపక్క ఎవరూ లేరన్న బాధ మరింత కుంగదీస్తుందని.. సొంత వాళ్ల దగ్గర ఉంటే వారి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. అనంతరం పలువురు వృద్ధులు తమ గోడును న్యాయమూర్తి ఎదుట వెళ్లబోసుకున్నారు. వేలిముద్రల సమస్యతో పింఛన్ రావడం లేదని కొల్లాపూర్‌కు చెందిన ఓ వృద్ధురాలు, తన కుమార్తె ఆచూకీ తెలపాలని మరో వృద్ధురాలు వేడుకున్నారు. ఇందుకు స్పందించిన ఆయన సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఆశ్రమంలోని పడక గదులు, భోజనశాల, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సబిత, న్యాయ విభాగంలోని అధికారులు మధుసూదన్‌రావు, శ్రీరామ్ ఆర్య, దేవిక, బాబు పీయర్స్, రాంబాబు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐఎఫ్‌డీ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైనింగ్, డిగ్రీ, డిప్లమా, పీడీ డిప్లమా వంటి కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఆర్థికంగా వెనుకబడిన వారికి మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా ఫీజులో రాయితీ పొందే అవకాశం ఉందని సంస్థ డైరెక్టర్ రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో మే 20వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, మే 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వడదెబ్బతో ఇద్దరు ఉపాధి కూలీలు మృతి

గోపాల్‌పేట/మల్దకల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరు ఉపాధి హామీ కూలీలు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని చీర్కపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఒకరు మృతి చెందాడు. రేవల్లి ఎంపీడీఓ సుజాత తెలిపిన వివరాలు.. సోమవారం చీర్కపల్లికి చెందిన బాలనాగయ్య (58) అందరితో పాటు ఉపాధి పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో బాలనాగయ్య కళ్లు తిరిగి పడిపోయాడు. అక్కడే ఉన్న కూలీలు అతడికి ఓఆర్‌ఎస్, నీళ్లు తాగించి ఇంటివద్దకు తీసుకువెళ్లి, అనంతరం ఆస్పత్రిలో చూపించి పడుకోబెట్టారు. కాగా రాత్రి 10గంటల ప్రాంతంలో మరణించాడు. విషయం తెలియడంతో మంగళవారం ఉదయం ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ శ్రీరాములు చీర్కపల్లిలోని బాలనాగయ్య ఇంటికి వెళ్లి పంచనామా నిర్వహించారు. ఇంటికి పెద్దదిక్కైన బాలనాగయ్య మరణించడంతో వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడికి భార్య నాగమ్మ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

■ జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం కుర్తిరావల్‌చెరువు గ్రామానికి చెందిన మోషన్న(50) రోజు ఉపాధి కూలీ పనులకు వెళ్లేవాడు. మంగళవారం కూడా కూలీ పనులకు వెళ్లిన మోషన్న అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

ఊట్కూర్: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని తిప్రాస్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి చిన్న నర్సిములు తండ్రి సాయన్న తన పంట పొలాల్లో అక్రమంగా పల్లవి కంపెనీకి చెందిన నకిలీ పత్తి విత్తనాలు నిల్వ ఉంచి.. విక్రయాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. ఈ ఘటనలో 71 పాకెట్లలో 31.95కిలోల పత్తి విత్తనాలను సీజ్ చేశారు. వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి పంచనామ నిర్వహించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఐదుగురు ఆత్మహత్య

బిజినేపల్లి: తిమ్మాజీపేట బస్టాండ్‌లో మే 11వ తేదీన పురుగుల మందు తాగిన శంకర్ 45) సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. లక్ష్మణ్‌నాయక్‌తండాకు చెందిన శంకర్ మే 11న తిమ్మాజీపేట బస్టాండులో పురుగుల మందు తాగాడు. విషయం గమనించిన తోటి ప్రయాణికులు ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న శంకర్ సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిమ్మాజీపేట పోలీసులు తెలిపారు.

కోడుపర్తిలో...

ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన ఒక రైతు గోపికృష్ణ (44) తిమ్మాజీపేట మండలంలోని కోడుపర్తిలో తొమ్మిది సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. ఎం.గోపికృష్ణ కోడుపర్తి గ్రామంలో 9 ఏకరాల వ్యవసాయ భూమిని కోనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నాడు. స్నేహితుడి స్నేహితుడికి రూ.40లక్షలు అప్పుగా ఇచ్చాడు. తిరిగి డబ్బులు ఇవ్వాలని తన స్నేహితుడిని కొన్నాళ్లుగా అడుగుతున్నాడు. డబ్బు తీసుకున్న వ్యక్తి కొన్ని కొద్ది రోజులుగా స్పందించడం లేదు. దీంతో అప్పుభారమై సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. ఇంటి వద్ద దీన్ని గమనించిన స్థానిక వాచ్‌మెన్ వెంటనే జడ్చర్లలోని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. మృతుని తమ్ముడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో మహిళ..

ఎర్రవల్లి చౌరస్తా: మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఇటిక్యాల ఎస్‌ఐ గోకారి కథనం ప్రకారం.. మండల పరిధిలోని మొగిలిరావులచెర్వు గ్రామానికి చెందిన పద్మ(48) కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో మనస్తాపానికి గురై మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో గొడవపడి..

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లిలో బూరం అంజయ్య (42) వ్యక్తి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. అంజయ్య కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మద్యం కోసం డబ్బులు కావాలని భార్య లక్ష్మతో గొడవపడి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. గుర్తు తెలియని పురుగుల మందు తాగి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే ఆటోలో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహామేరకు నాగర్‌కర్నూల్ ఆస్పతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మంగళవారం భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి..



బోయ ఉసేని (ఫైల్)

అయిజ: పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని భూంపురం గ్రామానికి చెందిన బోయ ఉసేని(42) మంగళవారం మధ్యాహ్నం పంటపొలంలో పురుగు మందు తాగాడు. సాయంత్రం ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుంటే కుటుంబసభ్యులు ఆరాతీశారు. పురుగు మందు తాగినట్లు తెలియడంతో అతడిని వెంటనే గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతిచెందాడు. పురుగుల మందు తాగడానికి కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ప్రియుడు మృతిచెందాడని..

ప్రియురాలి బలవన్మరణం




రామేశ్వరి (ఫైల్)

గద్వాల క్రైం: తను ప్రేమించిన యువకుడు మృతిచెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటన గద్వాలలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ రామస్వామి కథనం మేరకు.. పట్టణంలోని గంటవీధికి చెందిన బోయ రామేశ్వరి (22) డిగ్రీ పూర్తి చేసింది. చదువుకొనే రోజుల్లో కర్నూలుకు చెందిన జయంత్ అనే యువకుడితో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. అయితే కుటుంబ సమస్యల కారణంగా జయంత్ ఈ నెల 14న ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి రెండ్రోజుల క్రితం స్నేహితురాలైన సంగీతతో కలిసి ప్రియుడి అంత్యక్రియలకు హాజరైంది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదన, మనస్తాపానికి గురైంది. రామేశ్వరి, సంగీత కొంతకాలంగా గాంధీచౌక్‌లో ఉండే రామతులసి ఆరోగ్య బాగోగులు చూసేందుకు ఆమె ఇంట్లో విధులు నిర్వర్తిస్తుండేవారు. ఈ క్రమంలో పనిచేస్తున్న ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్నేహితురాలైన సంగీత మంగళవారం ఉదయం విధులకు వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో వెంటనే బంధువులు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. రామేశ్వరి తల్లి కుర్మక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించే పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ మంజుల పేర్కొన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని మంగళవారం వారు పరిశీలించి ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రంలో మొత్తం 180 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు వారు తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

దర్గాలో ప్రార్థనలు



పాన్‌గల్: మండల కేంద్రం సమీపంలోని బాలపీర్లా దర్గాలో మంగళవారం ఆటో, జీపు డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి బాలపీర్లా దర్గా వరకు ఆటో, జీపులతో ర్యాలీ నిర్వహించారు. హాఫీసాబ్ సమక్షంలో దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవి, అంజి, బషీర్, అబ్దుల్లా, అంజి, శివ, దేష్‌నాయక్, బుడ్డయ్య, దాసు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆత్మకూర్: పట్టణంలోని ఆరో వార్డులోని బీసీ కాలనీలో నివాసముంటున్న కృష్ణయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వారి ఆర్థిక పరిస్థితులు బాగోలేవని తెలుసుకున్న మాజీ వార్డుసభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు అంత్రక్రియల నిమిత్తం రూ. 5 వేలు ఆర్థికసాయం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు బుచ్చన్న, శ్రీను, రవి, సవరన్న, కమామాల్, అంజి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని నిరసన

కోడేరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్‌ఓల డ్యూటీకి సంబంధించిన 2018 నుంచి ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదని కొల్లాపూర్ ఐసీడీఎస్ సమావేశాలకు వెళ్లినా టీఏ డీఏ డబ్బులు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది వరలక్ష్మీ, పద్మ, నాగమణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తకోట: మండలంలోని అమడబాకుల సమీపంలో ఉన్న తెలంగాణ మోడల్ కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయని.. ప్రతి గ్రూప్‌లో 40 సీట్లు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు www.tsmodelschools.com వెబ్‌సైట్‌లో ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థినులకు హాస్టల్ వసతి కలదన్నారు.

దొంతికుంటతండా ఆదర్శ కళాశాలలో..

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంట తండా స్టేజీ సమీపంలో ఉన్న తెలంగాణ ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వాణికుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసి, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉండగా.. ఒక్కో గ్రూపులో 40 సీట్లు అందుబాటులో.. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 25 వరకు www.tsmodelschools.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

కొల్లాపూర్: సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్ గుర్తింపు కార్డులు ఉన్న కార్మికులకు మూడు రోజులు నిర్వహిస్తున్న వైద్యశిబిరం మంగళవారం ముగిసింది. కార్మికులు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్ పర్యవేక్షించారు. చంద్రశేఖరాచారి, సూగూరు భాస్కర్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



మదనాపురంలో..



ఖిల్లాఘనపురం మినీ స్టేడియంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో రాణించాలని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, జెడ్పీటీసీ శివరంజని, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జాతర మైదానంలోని మినీ స్టేడియంలో సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, విరేశలింగం, అనిల్‌గౌడ్, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పీఈటీలు సంతోషి, అశోక్, రమేష్, అంబేద్కర్, కోచ్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో రెండో రోజు నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మంగమ్మ, జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే క్రీడాస్ఫూర్తి ప్రదర్శించిన వారవుతారని ఎంపీపీ కమలేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండల స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, ఎత్తం కృష్ణయ్య, సర్పంచ్ నర్సింహారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, ఆర్‌ఐ కురుమూర్తి, సింగిల్ విండో డైరెక్టర్ సూర్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, సీఆర్పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో..



వీపనగండ్లలో..

పాన్‌గల్: రెండో రోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించినట్లు ఎంపీఓ రఘురాములు పేర్కొన్నారు.

పెబ్బేరు: పట్టణంలో సీఎం కప్ పోటీలను రెండో రోజు ఎంపీపీ ఆవుల శైలజ, జెడ్పీటీసీ పద్మ, చైర్‌పర్సన్ కరుణశ్రీ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహంలింకన్, కమిషనర్ ఆదిశేషు, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ జయరాములు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: సీఎం కప్ రెండో రోజు పోటీలను మండల కేంద్రంలో తహసీల్దార్ నరేందర్ టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రం, డీటీ అశోక్‌కుమార్, పీఈటీ రామచంద్రమ్మ, ఎస్‌ఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో రెండో రోజు క్రీడలను ఎంపీపీ కృష్ణానాయక్, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు మన్యం, చందర్ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



అమరచింతలో..



ఆత్మకూర్‌లో..

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మదాసి, మాదారి కురువ సంఘం నాయకులు

అమరచింత: ఎస్సీ జాబితాలో మొత్తం 59 ఉపకులాలు ఉన్నాయని, వాటిలో సీరియల్ నెంబర్ 30లో ఉన్న మాదాసి, మాదారి కురువలు ఎస్సీ ఉపజాతులకు చెందిన వారని పేర్కొన్నారని మాదాసి, మాదారి కురవలు అన్నారు. కొంత మంది తమను బీసీలంటూ హేళన చేస్తున్నారని, తమకు ఎస్సీ సరిఫికేట్ ఇవ్వాలని తహసీల్దార్ చాంద్‌పాషాకు మంగళవారం వారు వినతిపత్రం అందించారు. ఈమేరకు మదాసి, మాదారి కురువ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ రాజ్యాంగ ప్రకారం తమకు వర్తించే విధంగా కుల ధృవీకరణ పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాల్లో మదాసి, మదారి కురువలకు ఎస్సీ సర్టిఫికేట్‌లు ఇస్తున్నారని, మన రాష్ట్రంలో మాత్రం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బతుకు దెరువు కోసం గొర్రెలను మేపుకుంటూ సంచార జీవనం సాగిస్తున్న తమకు దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కటం లేదని వాపోయారు. నిజమైన ఎస్సీలుగా గుర్తించాలని ఉద్యమాలు చేస్తున్నామని, ప్రభుత్వం సైతం ఎస్సీ సర్టిఫికేట్లు ఇవ్వడానికి సిద్ధమైందన్నారు. అమరచింత పట్టణంలో కొంతమంది ఎస్సీలమంటూ తమకు దక్కాల్సిన రిజర్వేషన్లు వారు దోచుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. మదారి, మదాసి కురువలు ఎస్సీలు కారంటూ ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు ఇవ్వడం తగదన్నారు. ఎస్సీల ముసుగులో లబ్ధి పొందుతున్నది ఎవరన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో మదాసి, మదారి కురువ సంఘం మండల అధ్యక్షుడు అంజనేయులు, మహేష్, భరత్, అనిల్, రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఖిల్లాఘనపురం: మండలంలోని షాపురం గ్రామానికి చెందిన రాకేష్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో ముఖ్యమంత్రి సహాయం కోసం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిశాడు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని మంగళవారం హైదరాబాద్ మంత్రుల నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి నిరంజన్‌రెడ్డి అందజేశారు. రాకేష్‌తో పాటు కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షాపురం సర్పంచ్ బాలాంజనేయులుగౌడ్, రాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం

మదనాపురం: మండలంలోని కొన్నూరు గ్రామానికి చెందిన మన్యపు రాజు అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. దీంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయిన రూ.1.50లక్షల చెక్కును మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్, ఎంపీటీసీ శరత్‌చంద్రారెడ్డి, జెడ్పీటీసీ కృష్ణయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు అచ్యుతారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

వీపనగండ్ల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని గోపల్‌దిన్నె సర్పంచ్ విజయ్‌కుమార్, మండల మహిళా సమైక్య సీసీ వీరయ్య అన్నారు. మంగళవారం గ్రామంలో వారు మండల మహిళా సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



గోపల్‌దిన్నెలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, సీసీ

ప్రతి ఒక్కరూ 'ఆధార్' అప్‌డేట్ చేసుకోవాలి



కొత్తపేటలో ఆధార్ అప్‌డేట్ పత్రాన్ని అందజేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్

పాన్‌గల్: ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపేట, రాయినిపల్లి గ్రామాల్లోని జీపీ భవనంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి జీపీల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రమేష్, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఆధార్ కేంద్రం నిర్వహకులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నెట్‌బాల్ క్రీడాకారుడు ఫాజిల్‌కు సన్మానం

అమరచింత: క్రీడల్లో రాణించి పట్టణానికి పేరు ప్రతిష్టతలు తీసుకురావాలని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. పట్టణానికి చెందిన సయ్యద్ ఫాజిల్ అనే గురుకుల ఇంటర్ విద్యార్థి జాతీయ స్థాయిలో నెట్‌బాల్ పోటీలో పాల్గొని రెండో బహుమతిని దక్కించుకోవడం సంతోషకరమన్నారు. ఈమేరకు క్రీడాకారుడు ఫజీల్‌ను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అమరచింతకు చెందన సయ్యద్ ఖాసీం కుమారుడు సయ్యద్ ఫాజిల్ మహబూబ్‌నగర్‌లోని మైనార్టీ గురుకులంలో ఇంటర్ చదువుతూ నెట్‌బాల్‌లో రాణించడం గర్వకారణం అన్నారు. నెట్‌బాల్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఖ్యాతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయాబ్‌ఖాన్, నాయకులు మహేందర్ రెడ్డి, అరుణ్‌కుమార్, తౌఫిక్, పోసిరి గారి విష్ణు, శ్యాం, బాసీత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఫాజిల్‌ను సన్మానిస్తున్న నాగరాజ్‌గౌడ్

మారోజు వీరన్నకు ఘన నివాళి



వీరన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: వర్గ, కుల నిర్మూలన పోరాట సిద్ధాంతకర్త, తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఊపిరి వదిలిన మారోజు వీరన్న సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మారోజు వీరన్న 24వ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ.. దళిత, తెలంగాణ ఉద్యమాలను మమేకం చేసిన విప్లవ వీరుడు మారోజు వీరన్న అని గుర్తు చేశారు. మారోజు వీరన్న కలలుగన్న బహుజన రాజ్యంతోనే తెలంగాణ సమాజం ఆశించిన మేర బాగుపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, డప్పు నాగరాజు, గంధం నాగరాజు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, జ్ఞానేశ్వర్, పరమేశ్వరచారి, మురళీధర్ చారి, గంగాధర్‌చారి, మాధవాచారి. సత్యం చారి, రమేష్ చారి, రాము చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సవరమ్మ జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవరమ్మ దేవత జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆలయంలోని మూల విరాట్‌కు పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. కుల, మతాలకు అతీతంగా గ్రామ దేవతగా పూజలందుకుంటున్న సవరమ్మ దేవతకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి కోళ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వస్తున్న భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా నీటి వసతితో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకోనే అవకాశం కల్పించామని నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, అరేందర్‌రెడ్డి తెలిపారు.

డెంగీ నివారణకు నడుం బిగిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ పద్మావతి

వనపర్తి: జనావాస ప్రాంతాల్లో పరిశుభ్రత పాటిస్తే డెంగీలాంటి ప్రాణాంతక వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని ఆర్డీఓ పద్మావతి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆవాసాల్లో నీరు ఎక్కువ కాలం నిల్వ చేయరాదని, నిల్వ నీటిలోనే డెంగీ దోమలు వృద్ధి చెందుతాయన్నారు. జిల్లాలో 2022లో 42 కేసులు నమోదు కాగా.. 2023లో ఇప్పటి వరకు కేవలం ఆరు కేసులే నమోదైనట్లు తెలిపారు. తీవ్ర జ్వరం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, తీవ్ర తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం వంటి లక్షణాలుంటే డెంగీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడంతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, డీఎంహెచ్ఓ డా. రవిశంకర్, ఏఓ సాయినాథ్‌రెడ్డి, జిల్లా అధికారులు, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పుర వీధుల గుండా డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధిని నివారించవచ్చన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మమత, నాగరాజు, లారెన్స్, శ్రీనివాస్, సంతోషమ్మ, సుమనశ్రీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: డెంగీ వ్యాధిని సమాజం నుంచి వెలివేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో ప్రజలకు అవగాహణ కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. జూన్, జులైలో సీజనల్ వ్యాధిగా డెంగీ వ్యాధి విస్తరిస్తుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి నుంచి తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మంజుల, ఆరోగ్య కార్యకర్తలు రామచంద్రమ్మ, జహంగీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి బారినపడకుండా నివారణ చర్యలు తీసుకునే అవకాశం మన చేతుల్లోనే ఉందని, దోమలు వ్యాప్తి పెరగకుండా చర్యలు తీసుకోవాలని సబ్‌యూనిట్ అధికారి అయ్యూబ్‌ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఆత్మకూర్ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

గోపాల్‌పేట: తీవ్రమైన జ్వరం, శరీరంపై ఎర్రని దద్దుర్లు రావడం, కండరాలు, కీళ్లలో నొప్పులు ఉన్నట్లు గుర్తిస్తే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని డాక్టర్ క్లైవిన్‌మార్క్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండు వరకు ర్యాలీ తీశారు. డెంగీపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పనిసరిగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. వారానికి ఒకసారి ఇంటి ఆవరణలోని నిల్వ నీటిని కింద పారబోసి కొత్తనీరు పట్టుకోవాలని సూచించారు.



ఆత్మకూర్‌లో..



వీపనగండ్లలో..



పాన్‌గల్‌లో..



గోపాల్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



కొత్తకోట రూరల్: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలంటూ నెల రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే ప్రభుత్వం స్పందించి వీఓఏలతో చర్చలు జరపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు చేపడుతున్న సమ్మెకు సీఐటీయూ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న వీఓఏలకు కచ్చిత వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలని, అదేవిధంగా గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీఓఏల సమస్యలను ప్రభుత్వం తీర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు మహిళా సమాఖ్య భవనం ఎదుట ధర్నా చేసి సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఈశ్వర్, మోతిబాయ్, శిరీష, సంగీత, శాంత, కృష్ణవేణి, సరోజ, పార్వతి ఉన్నారు.

అమరావతి భూములు.. సింగపూర్‌లో సంతర్పణ!

సింగపూర్ ప్రభుత్వమంటూ.. చివరకు ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం

- కేంద్ర ప్రభుత్వం అనుమతి లేదు... టెండర్ల ప్రక్రియ మాటే తేలేదు
- సింగపూర్ కంపెనీకి ముందుగానే అమరావతి మ్యాపులు.. అనంతరం బినామీల పేరుతో భూముల కొనుగోలు
- చంద్రబాబు – నారాయణ భూదందాకు కేంద్రస్థానంగా సీడ్ క్యాపిటల్
- స్విస్ చాలెంజ్ పేరుతో భూదోపిడీ



సాక్షి, అమరావతి: సింగపూర్ కంపెనీల ముసుగు తొలగిపోవడంతో అమరావతి కేంద్రంగా సాగిన భూదందా విస్మయపరుస్తోంది. చంద్రబాబు సింగపూర్ పర్యటనలు.. ప్రైవేట్ కంపెనీలతో ఎంవోయూలు.. స్విస్ చాలెంజ్ ఒప్పందాల వెనుక తీగను లాగుతుంటే కరకట్ట ఇంట్లో అవినీతి డొంక కదులుతోంది. అమరావతి మాస్టర్‌ప్లాన్, సీడ్ క్యాపి టల్ ప్లాన్ ఫైళ్లను తిరగేస్తుంటే బినామీల పేరుతో చంద్రబాబు, నారాయణ కొల్లగొట్టిన భూముల దస్త్రాలు బయటపడుతున్నాయి. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణతో భూదోపిడీ మొత్తం బయటపడుతోంది.

■ **కమిటీలో సింగపూర్ కంపెనీ ప్రతినిధి**

2014 జూన్‌లో అధికారం చేపట్టగానే రాజధాని పేరిట చంద్రబాబు భారీ భూదోపిడీకి పన్నాగాన్ని రూపొందించారు. 2015 జూలైలో రాజధాని సలహా కమిటీని నియమించి పొంగూరు నారాయణ, సుజనా చౌదరి, గల్లా జయదేవ్‌తోపాటు సింగపూర్ కంపెనీ ప్రతినిధికి స్థానం కల్పించడం గమనార్హం. అంతర్జాతీయ కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు వెళ్తున్నందున విదేశీ కంపెనీ ప్రతినిధిని సభ్యుడిగా నియమించడంపై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అభ్యంతరం తెలిపినా చంద్రబాబు పట్టించుకోలేదు. సింగపూర్ కంపెనీకి రాజధాని ప్రాంత ఎంపిక బాధ్యతను అప్పగించడం ద్వారా భారీ భూదోపిడీకి అప్పుడే పథకం వేశారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎనేబిలింగ్ యాక్ట్‌ను కూడా టీడీపీ సర్కారు ఉల్లంఘించింది. ఓపెన్ కాంపిటీషన్ ద్వారా డెవలపర్‌ను ఎంపిక చేయాలన్న నిబంధనను చంద్రబాబు ఖాతరు చేయలేదు.

■ **కేంద్రం అనుమతి లేదు.. టెండర్లూ లేవు**

2014 నవంబరులో చంద్రబాబు సింగపూర్ పర్యటనలోనే భూదోపిడీకి స్కెచ్ వేశారు. ఆ వెంటనే డిసెంబరులో రాజధాని మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు సింగపూర్ కంపెనీతో చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా ఎంవోయూ కుదుర్చుకుంది. విదేశీ కంపెనీతో చేసుకునే ఒప్పందాలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం. అయితే కేంద్రం అనుమతి లేకుండానే ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం. ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నట్లు అప్పటి సీఎం చంద్రబాబు బుకాయిస్తూ వచ్చారు. తద్వారా ఇతర కంపెనీలు పోటీకి రాకుండా నిరోధించారు. కానీ సంబంధిత శాఖల నోట్ ఫైల్స్‌లో ఎక్కడా సింగపూర్ ప్రభుత్వం అనే ప్రస్తావనే లేదు. చివరికి చంద్రబాబు ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది సింగపూర్ ప్రభుత్వంతో కాకుండా ఓ ప్రైవేట్ కంపెనీతో కావడం గమనార్హం. ఇక రాజధాని ప్రాంతంలో అత్యంత కీలకమైన సీడ్ క్యాపిటల్ ఎంపిక కోసం ప్రత్యేకంగా మాస్టర్ ప్లానర్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా ఎంపిక చేసింది. అందుకోసం కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టలేదు. సింగపూర్‌కే చెందిన కంపెనీలను మాస్టర్ డెవలపర్‌గా ఎంపిక చేయాలని ఎంవోయూలో స్పష్టం చేశారు. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపొందించే కంపెనీ, సీడ్ క్యాపిటల్ మాస్టర్ డెవలపర్ ఎవరన్నది చంద్రబాబు ముందుగానే నిర్ణయించేశారు.

■ **2015 జనవరిలోనే అమరావతి మ్యాపులు...**

రాజధానిలో కీలకమైన సీడ్ క్యాపిటల్ ప్రాంతం ఎంపికలో చంద్రబాబు తన పన్నాగాన్ని అమలులోకి తెచ్చారు. విజయవాడ-గుంటూరు-తెనాలి- మంగళగిరి(వీజీటీఎం) పరిధిలోని జోనింగ్ మ్యాపులన్నీ 2015 జనవరిలోనే సింగపూర్ మాస్టర్ డెవలపర్‌కు గుట్టుచప్పుడు కాకుండా టీడీపీ ప్రభుత్వం అప్పగించేసింది. ఆ మ్యాపుల్లో పేర్కొన్న ప్రాంతాల్లోనే రాజధాని, సీడ్ క్యాపిటల్‌ను ఎంపిక చేయాలని చంద్రబాబు ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా నదికి అభిముఖంగా ఉద్దండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, లింగాయపాలెం గ్రామాల పరిధిలో సీడ్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. అంటే రాజధాని, సీడ్ క్యాపిటల్ ఏ మండలాలు, గ్రామాల పరిధిలో రానున్నాయో చంద్రబాబు, నారాయణ, వారి బినామీలకు ముందుగానే తెలుసన్నది స్పష్టమైంది. అనంతరం సింగపూర్ కంపెనీ సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను 2015 జూలైలో ప్రభుత్వానికి సమర్పించి కథ ముగించింది.

■ **పచ్చ ముఠా గుప్పిట్లో సీడ్ క్యాపిటల్**

2015 జనవరిలోనే సీడ్ క్యాపిటల్ ఎక్కడ రానుందో తెలిసిన చంద్రబాబు, నారాయణ తమ బినామీలను రంగంలోకి దింపారు. ఆ ప్రాంతంలో అతి తక్కువ ధరకు భూములను భారీగా కొనుగోలు చేశారు. సీఐడీ దర్యాప్తులో ఈ బినామీ లావాదేవీలు వెలుగులోకి వస్తున్నాయి. నారాయణ తన బినామీలు, బంధువుల పేరిట 65.50 ఎకరాలు కొనుగోలు చేసినట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటైన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. ఆ విధంగా కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్డీఏకు ఇచ్చారు. అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చదరపు గజాల స్థలాలు పొందారు. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్‌డీఏ ఇప్పటివరకు చెల్లించిన రూ.1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇదే రీతిలో చంద్రబాబు బినామీలు, సన్నిహితులు సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భారీగా భూములు గుప్పిట పట్టారు. దీనిపై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. త్వరలో మరిన్ని బినామీ లావాదేవీలు బహిర్గతం కానున్నాయి.

■ **స్విస్ చాలెంజ్ ముసుగులో 1,691 ఎకరాల దోపిడీ**

తమ దోపిడీకి మార్గం సుగమం చేసేలా రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన చట్టానికి చంద్రబాబు ప్రభుత్వం ఇష్టానుసారం సవరణలు చేసింది. ఓపెన్ కాంపిటీషన్ విధానాన్ని పక్కనపెట్టేసి స్విస్ చాలెంజ్ విధానంలో సీడ్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ ఒప్పందం చేసుకుంది. కౌంటర్ చాలెంజ్‌కు ఇతర కంపెనీలకు అవకాశం లేకుండా చేసి సింగపూర్ కంపెనీకి స్విస్ చాలెంజ్ కింద ఏకపక్షంగా కట్టబెట్టేసింది. సీడ్ క్యాపిటల్ అంచనా వ్యయం రూ.3,137 కోట్లు కాగా నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం అందులో 25 శాతం అంటే రూ.784 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకు బిడ్డింగ్ అర్హత ఉంటుంది. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం కనీసం రూ.2 వేల కోట్ల టర్నోవర్ ఉండటాన్ని అర్హతగా నిర్ణయించడం గమనార్హం. తద్వారా ఇతర కంపెనీలు ఏవీ పోటీకి రాకుండా కట్టడి చేసింది. ఇక సీడ్ క్యాపిటల్ కింద 1,691 ఎకరాల్లో నిర్మాణాలను సింగపూర్ కంపెనీకి కాంట్రాక్టు అప్పగించారు. కానీ అందులో సింగపూర్ కంపెనీ నిర్మించేది కేవలం 8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని భవనం మాత్రమే. అంటే మిగిలిన భూమి అంతా సింగపూర్ కంపెనీకే అప్పగించేశారు. ఆ ప్రకారం ఆ భూమిని ప్లాట్లు వేసుకుని అమ్ముకునే హక్కు కల్పించారు. సింగపూర్ కంపెనీ ముసుగులో చంద్రబాబు, ఆయన బినామీలు భూములను కాజేసేందుకే ఈ పథకం వేశారు.

'ఇన్నర్' మెలికలు

గత సర్కారు పెద్దల ఆదేశాలతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు జరిగాయి. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను ఆనుకుని ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్ రూపొందించారు. సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యూరాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్ ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. సీఆర్‌డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్‌కు ఒకచోట 9 ఎకరాలు, మరో చోట నాలుగు ఎకరాలు ఉండటం గమనార్హం.

పాపాల్లో పవన్‌కూ భాగం

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు వాటా కల్పించారు. కాజా వద్ద ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలో పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

అమాంతం పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.



బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం జగన్

జనంతోనే వారి యుద్ధం

- స్వార్థ రాజకీయాల కోసమే జనసేన–టీడీపీ నీచపు పొత్తులు
- నిజాంపట్నం సభలో సీఎం వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతిపక్షాలు జగన్‌తో కాకుండా, జనంతో యుద్ధం చేస్తున్నాయి. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఇతర పేదలందరికీ మంచి చేస్తుంటే గతంలో పాలన సాగించిన వారు, ఆ పాలనకు మద్దతిచ్చిన వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పేదవాడికి మంచి జరుగుతుంటే తట్టుకోలేకపోతున్నారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే చంద్రబాబుకు మత్స్యకారులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, ఇతరులు గుర్తుకొస్తారని చెప్పారు. మంగళవారం ఆయన బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఐదో విడత మత్స్యకార భరోసా కింద నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నేను చేసిన మంచిని, మిమ్మల్ని (ప్రజలు), దేవుడిని నమ్ముకున్నాను. ప్రజలకు ఏ మంచీ చేయని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పొత్తులని, ఎత్తులని, చిత్తులని, కుయుక్తులనీ నమ్ముకున్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండీ కూడా చంద్రబాబు పేరు చెబితే ఒక్క స్కీం కూడా గుర్తుకు రాదు. అందరికీ గుర్తుకు వచ్చేది వెన్నుపోటు, మోసం, కుతంత్రాలు మాత్రమే గుర్తుకు వస్తాయి' అని అన్నారు. పేదలకు ఏ మంచీ చేయని ఈ పెద్దమనిషికి ఎవరైనా ఎందుకు మద్దతిస్తారని ప్రశ్నించారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

దోచుకోవడమే వారి సిద్ధాంతం

- ఒక దత్తపుత్రుడు, ఒక దత్త తండ్రి.. వీరి పార్టీలు, సిద్ధాంతం ఒక్కటే. మన రాష్ట్రంలో దోచుకోవడం, దోచుకున్నది పంచుకుని హైదరాబాద్‌లో ఉండటం. ఎంతో మందిని ప్రధాన మంత్రులుగా, రాష్ట్రపతులుగా చేశానని చంద్రబాబు చెబుతుంటాడు. ఆయనకు మాత్రం మన రాష్ట్రంలో ఉన్న 175 స్థానాల్లో ఒంటరిగా బరిలో దిగే సత్తా మాత్రం లేదు.
- దత్తపుత్రుడు ఎమ్మెల్యేగా రెండు చోట్ల పోటీ చేస్తే.. అయ్యా మీరు మాకు ఎమ్మెల్యేగా కూడా వద్దు అని ప్రజలు నమస్కారం పెట్టి ఓడించారు. ఇదే దత్తపుత్రుడు రాజకీయ పార్టీ పెట్టి పదేళ్లు అయింది. 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పెట్టలేని పరిస్థితిలో ఉంది.
- ఒక్కో ఎన్నికకు ఒక్కో రేటు. పార్టీని హోల్‌సేల్‌గా అమ్ముకునే ఈ ప్యాకేజీ స్టార్ ఈ మధ్యకాలంలో అన్న మాటలు వింటే ఆశ్చర్యం కలుగుతోంది. ఆయన ముఖ్యమంత్రి అయినా, కాకపోయినా పర్వాలేదట. దోపిడీలో రావాల్సిన వాటా వస్తే చాలు అంటున్నాడు. వీళ్లంతా ఇలా ఎందుకు అంటున్నారో.. ఎందుకు కలుస్తున్నారో ఆలోచించండి.
- ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 వీళ్లంతా ఎందుకు కలుస్తున్నారు? రాష్ట్రాన్ని ఒక గజ దొంగల ముఠాగా దోచుకోవడానికే కలుస్తున్నారు. మరోపక్క మీ బిడ్డ ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని వ్యవస్థలు కత్తికట్టినా, ఎన్ని వ్యవస్థలను ప్రయోగించినా 15 ఏళ్లుగా మీ తరఫునే నిలబడ్డాడు. ఎక్కడా రాజీ పడలేదు. మనందరి ప్రభుత్వం చేసిన మంచిని చెబుతూ, మీ ఇంట్లో మీకు మంచి జరిగితేనే మీ బిడ్డకు తోడుగా మీరు సైనికుల్లా నిలబడాలని కోరుతున్నాను.

జాతీయస్థాయి పోటీలకు ఆత్మకూర్ క్రీడాకారిణి



ఆత్మకూర్: అండర్–16 సబ్ జూనియర్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు పట్టణానికి చెందిన క్రీడాకారిణి సమీనాబేగం ఎంపికైనట్లు కోచ్ ఖాదర్ తెలిపారు. వరంగల్, తమిళనాడులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. మంగళవారం స్థానిక మినీ స్టేడియంలో క్రీడాకారిణిని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యురాలు శివరంజని, పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు గాధి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, విరేషలింగం, అనిల్‌గౌడ్, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్ల రామకృష్ణ, పీఈటీలు సంతోషి, అశోక్, రమేష్, అంబేడ్కర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మూడ్రోజులు జైలు, రూ.2వేల జరిమానా

దేవరకద్ర: మండలానికి చెందిన ఓ వ్యక్తి తాగి వాహనం నడిపి పోలీసుల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. అతనికి కోర్టు మంగళవారం మూడు రోజుల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించిందని ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. గత ఫిబ్రవరిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా నాగారం గ్రామానికి చెందిన మల్లేశ్ పట్టుపడ్డారు. దీంతో కేసు నమోదు చేశారు. మంగళవారం జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా విచారించి మల్లేశ్‌కు మూడ్రోజుల జైలుశిక్ష , రూ.2వేల జరిమానా విధించారని తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 809.3 అడుగులు

దోమలపెంట(అచ్చంపేట): శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 809.3 అడుగులు, 33.9092 టీఎంసీలుగా నీటినిల్వ ఉంది. గత ఇరవై నాలుగు గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 243 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయంలో 210 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో 1,020 అడుగులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తి నీటిమట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాలువ నీటిని నిలిపివేశారు.

అభాగ్యులకు 'వాత్సల్యం'

- విధి వంచిన బాలలకు ఆర్థిక భరోసా
- జిల్లాలో ఇప్పటికే 13 మందికి ఉపకార వేతనం
- నెలకు రూ.4వేల వరకు ఆర్థికసాయం

మహబూబ్‌నగర్ రూరల్: విధి వంచిన బాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం 'మిషన్ వాత్సల్య' పథకాన్ని తీసుకొచ్చింది. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఈ పథకం అభాగ్య బాలలకు ఎంతో ఉపయోగపడుతోంది.

అనాథ పిల్లలు, తల్లిదండ్రులు కోల్పోయిన, దూరమైన వారు, విడాకులు పొందిన వారి పిల్లలు, వదిలేసిన పిల్లలు, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన వారు, ఇంటి పెద్ద కోల్పోయిన వారు ఈ పథకాన్ని ఉపయోగించుకోవచ్చు. బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం –2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలకార్మికులు, అక్రమ రవాణా, బాల యాచకులు, బాల్య వివాహాలు, హెచ్ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకం అండగా నిలుస్తుంది. మిషన్ వాత్సల్య పథకం ద్వారా వారి అభివృద్ధి కోసం ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున ప్రతి నెలా ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కావద్దని ఆరేళ్లకు పైబడి, 18 ఏళ్లు లోబడిన పిల్లలకు ఈ పథకం వర్తించనుంది.

విస్తృతంగా ప్రచారం..

జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బాధిత కుటుంబాలు కూడా దరఖాస్తు చేసుకుంటున్నాయి. వీటిని ఐసీడీఎస్ అధికారులు ఉన్నతాధికారులకు పంపించడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ప్రధానంగా కోవిడ్ బారిన పడి తల్లిదండ్రులను కోల్పోయిన 10 మంది అనాథ పిల్లలను గుర్తించారు. ఇద్దరు అనాథ పిల్లలకు, బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మరో అమ్మాకి కారణంగా రూ.4వేలు అందిస్తున్నారు. ప్రస్తుతం 13మందికి ఉపకార వేతనాలు ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బాలరక్ష భవన్‌లో అర్హులైన నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఇలా..

ఈ పథకాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను కేటాయిస్తున్నాయి. లబ్ధిదారులకు కేంద్రం ప్రతినెలా రూ.2,400, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,600 చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పథకం ద్వారా పిల్లలకు లబ్ధి చేకూరనుంది.

దరఖాస్తు చేసుకోవడం ఇలా...

అర్హులైన వారు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో కూడిన బృందం దరఖాస్తులను పరిశీలించి జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి ప్రభుత్వానికి వెళ్తుంది. దరఖాస్తుతో పాటు బాలుడు, బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, తల్లి, తండ్రి మరణ ధ్రువీకరణ పత్రాలు, గార్డియన్ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బాలుడు, బాలిక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించాల్సి ఉంటుంది.

నిబంధనలు పాటించాల్సిందే..

ఈ పథకంలో లబ్ధి పొందే పిల్లలు నిబంధనలు పాటించాల్సిందే. పిల్లలు 30 రోజుల పాటు పాఠశాలలకు హాజరుకాకపోయినా ఉపకార వేతనం నిలిచిపోతుంది. ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఇస్తారు. పిల్లలు హాస్టల్‌లో చేరినా నిధులు ఆగిపోతాయి. స్పాన్సర్‌షిప్ కమిటీ ప్రతి సంవత్సరం ఈ పథకాన్ని సమీక్షిస్తుంది. తల్లి మృతి చెంది, తండ్రి మరో వివాహం చేసుకుంటే ఈ పథకం వర్తించదు. ఈ పథకానికి ఉన్న పరిమితుల్లో కుటుంబ సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించకూడదు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



మిషన్ వాత్సల్య కింద ఆర్థికసాయం పొందేందుకు అనాథ పిల్లలు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. దరఖాస్తులు మాత్రం అర్హులైన వారి నుంచి స్వీకరిస్తున్నాం. మార్గదర్శకాలు రాగానే కార్యాచరణను రూపొందిస్తాం.

– జరీనాబేగం, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి

పోలీసుల దాడులు శోచనీయం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అయిజ: బీఎస్పీకి రోజురోజు పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో పార్టీ అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్‌పై పోలీసులు అకారణంగా దాడి చేశారని.. దీన్ని ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో బహుజన రాజ్యాధికార యాత్ర కీలకదశలో ఉందని.. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సమస్యలు ఉన్నాయని తెలిపారు. మిషన్ భగీరథ లక్ష్యం నెరవేరలేదని.. రహదారి సౌకర్యాలు సరిగా లేవని, భారీ వర్షాలు కురుస్తే సింధనూరు–అయిజ మధ్య రాకపోకలు నిలిచిపోతాయన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి ఎవరూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల గురించి మాట్లాడటం లేదని.. బీఆర్ఎస్ నాయకుల అనుచరులే దళితబంధు పథకం లబ్ధి పొందేలా చూస్తున్నారని, ప్రజాప్రతినిధులు ఒక్కో లబ్ధిదారు నుంచి రూ. 3 లక్షలు కమీషన్ తీసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా మన ఊరు – మన బడి పథకానికి రూ.7,289 కోట్లు మంజూరు చేసినా.. ఇప్పటి వరకు రూ.3,497 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, కేవలం 20 శాతం పనులు పూర్తికాగా.. 30 శాతం పనులు చేయకుండానే బిల్లులు చేశారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సవాళ్లను అధిగమించాలి



వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- పాలెంలో వ్యవసాయ నూతన కళాశాల ప్రారంభం

బిజినేపల్లి: ప్రపంచ జనాభాకు పౌష్టికాహారం అందించడం, భూ వాతావరణంలో వస్తున్న మార్పులను నిలదొక్కుకుని వ్యవసాయ రంగం మనుగడ సాధించడమనే ప్రధానమైన రెండు సవాళ్లు ఉన్నాయని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. దేశం మొత్తం యాసంగిలో వరి పంట సాగు ఎంతఅయ్యిందో.. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అంత ధాన్యం పండించామన్నారు. మంగళవారం బిజినేపల్లి మండలంలోని పాలెం వ్యవసాయ కళాశాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. వ్యవసాయ విద్యను అభ్యసించడంలో బాలికలు ముందున్నారని, ఈ రంగంలో బీమా, బ్యాంకింగ్, ప్రాసెసింగ్, మార్కెటింగ్, విత్తనోత్పత్తి, వంటి ఎన్నో రంగాల్లో ఉద్యోగ అవకాశాలున్నాయని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీజీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శక్తినిచ్చే పౌష్టికాహారం దేశంలోని ప్రజలకు అందేలా వ్యవసాయం స్థిరపడి బలపడాలన్నారు

వ్యవసాయంలో అపార అవకాశాలు : ఎంపీ

వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు భవిష్యత్‌లో వందల అవకాశాలు వస్తాయని, విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా వ్యవసాయంలో ఉత్పత్తుల్ని పెంచే దిశగా పరిశోధనలు చేసే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంపీ రాములు అన్నారు.

సంపాదన పెంచేలా వ్యవసాయం..

పాలెం వ్యవసాయ కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా వ్యవసాయ సంపదను పెంచేలా కృషి చేయాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. లాభాలు ఆర్జించేలా వ్యవసాయ ఉత్పత్తుల్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ హన్మంతరావు, వీసీ రఘునందన్‌రావు, ఏడీఆర్ మల్లారెడ్డి, అసోసియేట్ డీన్ పుష్పావతి, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందిరానివ్వొద్దు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

జడ్చర్ల: ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డులోని సింగిల్‌విండో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కాగా మిల్లర్లు ధాన్యం కటింగ్ ఎక్కువగా చేస్తున్నారని కొందరు రైతులు తెలపగా, ధాన్యం శుభ్రం చేసేందుకు ప్యాడి క్లీనింగ్ మిషన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామని, కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేశామని, వాటితో తూర్పారబట్టుకుని ఎలాంటి కటింగ్ లేకుండా ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కమిషనర్ చెప్పారు. అయితే తూర్పార బట్టేందుకు, రవాణాకు,కూలీలకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని, అవేమీ లేకుండా బహిరంగ మార్కెట్‌యార్డులో విక్రయిస్తే మంచి ధరలు వస్తున్నాయని కొందరు రైతులు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నందునే బహిరంగ మార్కెట్‌లో మంచి ధరలు దక్కుతున్నాయని రైతులకు అధికారులు సూచించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు నాలుగు యంత్రాలను సరఫరా చేసినా వినియోగించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదం జరిగిన గోదాం పరిశీలన..

పత్తి మార్కెట్ యార్డులో గల సివిల్ సప్లయ్ గోదాములో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంపై కమిషనర్ విచారించారు. గోదాములో ఆస్తి నష్టాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. పూర్తి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ సీతారాం, సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్, డీటీలు కిషోర్, బాలప్రసాద్, నాగరాజు, గిర్దావర్ రఘు ఉన్నారు.